# సర్టిఫికెట్ల కోసం పడిగాపులు

- తహసీల్దార్ ఆఫీసుల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు
- ఒక్కో ఆఫీస్‌లో వెయ్యికి మించి పెండింగ్‌లో..
- అందినకాడికి దండుకుంటున్న దళారులు




మోర్తాడ్(బాల్కొండ) : కుల వృత్తులపై ఆధార పడిన బీసీలకు రూ. లక్ష సాయంను ప్రభుత్వం ప్రకటించగా దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం అభ్యర్థులు అష్టకష్టాలు పడుతున్నారు. మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి కాపీలను తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తున్నారు. అలా అందించిన సర్టిఫికెట్ దరఖాస్తులను ఒకే చేయడానికి తహసీల్దార్లపై ఒత్తిడి తీవ్రమైంది. ఒక వైపు దశాబ్ది సంబరాలను విజయవంతం చేయడానికి తహసీల్దార్లు ప్రధాన పాత్ర పోషిస్తూనే రెగ్యులర్ విధులను నిర్వహిస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్‌లతో పాటు బీసీ సాయం అభ్యర్థుల సర్టిఫికెట్లకు ఆమోదం తెలుపడం తలకుమించి భారం అవుతుంది. జిల్లాలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల దరఖాస్తులు పేరుకుపోయాయి. ఒక్కో తహసీల్దార్ కార్యాలయంలో వెయ్యికి మించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. బీసీ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 20 తేదీ చివరి రోజు కావడంతో సర్టిఫికెట్‌ల కోసం అభ్యర్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొందరు దళారులు కార్యాలయాల వద్ద కాపుకాసి తొందరగా రెండు సర్టిఫికెట్‌లను తయారు చేయించడానికి అభ్యర్థుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సర్టిఫికెట్‌ల కోసం దళారులు కొందరు అభ్యర్థుల నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మీ సేవ కేంద్రాల్లో..**

కుల, ఆదాయ సర్టిఫికెట్లను తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఆమోదం తెలిపిన తర్వాత ప్రత్యేక కాగితంపై మీసేవ కేంద్రాలు ప్రింట్ తీసి ఇస్తాయి. ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన స్టేషనరీని ప్రభుత్వం ఒక ఏజెన్సీ ద్వారా విక్రయిస్తుంది. తాజాగా రెండు రకాల సర్టిఫికెట్‌లకు డిమాండ్ ఏర్పడటంతో మీసేవ కేంద్రాల్లో స్టేషనరీ కొరత తీవ్రమైంది. గతంలో ఇండెంట్ పెట్టిన మూడు, నాలుగు రోజుల్లో స్టేషనరీ సరఫరా చేసేవారు. ఇప్పుడు వారం దాటినా స్టేషనరీ అందుబాటులోకి రావడం లేదు. ఏది ఏమైనా బీసీ సాయం అందించే మాట ఎలా ఉన్నా మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో మాత్రం రద్దీ విపరీతంగా ఏర్పడిందని చెప్పవచ్చు.

**సర్టిఫికెట్ల ఆదాయం దండిగానే..**

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అభ్యర్థులు మీసేవ కేంద్రాలకు చెల్లించే ఫీజు నుంచి ఒక్కో సర్టిఫికెట్‌పై ప్రభుత్వానికి రూ. 35 చొప్పున ఆదాయం లభిస్తుంది. ప్రతి అభ్యర్థికి రెండు రకాల సర్టిఫికెట్ల అవసరం కావడంతో రూ. 70 చొప్పున ఫీజును ప్రభుత్వానికి చెల్లిస్తున్నాడు. రోజు వేలాది సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు అందుతుండటంతో ప్రభుత్వానికి ఆదాయం దండిగానే సమకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## గిరిజనుల అభివృద్ధి కోసం కృషి


ఆర్మూర్ మండలం పిప్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


సింగంపల్లి తండాలో గిరిజనులతో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్ : గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని అమ్రాద్ తండాలో జరిగిన గిరిజనోత్సవంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం ప్రత్యేక కార్యాచరణతో తండాలను జీపీలుగా మార్చి అభివృద్ధి చేశారన్నారు. జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో పూజలు నిర్వహించి రూ. 20 లక్షలతో నిర్మించ తలపెట్టిన జీపీ భవన నిర్మాణంకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, ఎంపీపీ మాస్త ప్రభాకర్, అమ్రాద్ విండో చైర్మన్ ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రజనీష్, బూరోల్ల అశోక్, గోపు రంజిత్ పాల్గొన్నారు.

**సింగంపల్లి తండాలో జెడ్పీ చైర్మన్**

బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని సింగంపల్లితండా, క్రింది తండాల్లో జరిగిన గిరిజనోత్సవంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీపీవో జయసుధ, జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ పాల్గొన్నారు. అనంతరం రూ. 1.50 లక్షల జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన ఆరు గిరిజన తండాల గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకై రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు వెల్లడించారు. పారిశుద్య కార్మికులను సన్మానించారు. ఎంపీడీవో క్రాంతి, సింగంపల్లి తండా సర్పంచ్ రాథోడ్ గంగాధర్, కింది తండా సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ మీరాబాయి, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, పీర్‌సింగ్, నర్సింగ్, జోర్‌సింగ్ పాల్గొన్నారు.

**సీఎంను ఢీకొట్టే సత్తా ఏ పార్టీకి లేదు..**

ఆర్మూర్ : అవినీతితో నిండిపోయిన కాంగ్రెస్, అబద్దాలతో ప్రజలను మోసం చేసే బీజేపీ రెండు పార్టీలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి శత్రువులను పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆర్మూర్ మండలం పిప్రిలో నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అక్కడ సభలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను ఢీకొట్టే సత్తా ఏపార్టీకి లేదన్నారు. మహిళా సంఘ భవన నిర్మాణానికి రూ. 2 లక్షల మంజూరు చేశారు. ఆయన వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## క్లుప్తంగా

### ఉద్యోగాలు సాధించాలి




మాక్లూర్ : ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించాలని కాకతీయ మహిళ ఇంజినీరింగ్ కళాశాల మెనేజర్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మాణిక్ భండార్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశం శనివారం నగర శివారులోని సుగుణ గార్డెన్‌లో జరిగింది. కార్యక్రమానికి మేనేజర్ నాగేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు ఆట పాటలతో సరదాగా గడిపారు.

### రోడ్డు పనులకు భూమిపూజ



డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండలంలోని గాదెపల్లి గ్రామంలో ఉపాధిహామీ కింద చేపడుతున్న రోడ్డు పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి పాతూరు రాంమందిరం వరకు మొత్తం 3.5 కిలో మీటర్లు మట్టి రోడ్డు వేయనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కల భూమేశ్, ఉప సర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నియామకం


మొయినుద్దీన్

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మర్కజ్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ ఎన్నికయ్యాడు. ఆర్మూర్ పట్టణ మర్కజ్ కమిటీ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల్లో కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ మొయినుద్దీన్, ఉపాధ్యక్షుడిగా అథిక్, సెక్రటరిగా అబ్దుల్ రెహ్మాన్, జాయింట్ సెక్రటరీగా రిజ్వాన్, కోశాధికారిగా సాజిద్ గెలుపొందారు.

### చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): రెంజల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ముగ్గురు లబ్దిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

### ఎస్సైకి సన్మానం



నవీపేట : సీఐగా పదోన్నతి పొందిన నవీపేట ఎస్సై రాజారెడ్డిని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శనివారం సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ బోధన్ నియోజకవర్గ కన్వీనర్ మానికొల్ల గంగాధర్, మండల నాయకులు రమేష్, జీవన్, మోహన్, సంజీవ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### జీపుజాతను జయప్రదం చేయండి

నవీపేట : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తలపెట్టిన జీపుజాతను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జీపు జాతకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈనెల 16న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన జీపుజాత 19న జిల్లా కేంద్రానికి వస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాధవి, ఉమారాణి, రమాదేవి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

### వివాదాస్పద స్థలంలో నిర్మాణం

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర కాలనీలో కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో నిర్మాణాన్ని చేపడుతున్నట్లు బాధితుడు అర్వింద్ ఆరోపించారు. యోగేశ్వర కాలనీలోని సర్వే నెంబర్ 80లో గల 123 గజాల స్థలం యాజమన్య హక్కుల విషయంలో ఆర్మూర్‌కు చెందిన దోండి కుబీర్ అర్వింద్, ఇటీవలే బీజేపీలో చేరిన ఓ నాయకుడు మధ్య వివాదం కోర్టులో ఉంది. కాగా స్థల వివాదం కోర్టులో తేలకముందే నిర్మాణ చేపడుతున్నాడని అర్వింద్ ఆరోపించారు. అధికారులు సంబంధించి న్యాయం చేయాలని కోరారు.

## పీడీయాక్ట్ నమోదు చేయాలి


ఏసీపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రెంజల్ బేస్ కాలనీలోగల దారుల్ ఉలూమ్ బోధన్ ఎమ్మెల్యే షకీల్‌ను ఎంఐఎం పార్టీకి చెందిన నాయకులు అడ్డుకొని హత్య చేయడానికి యత్నించారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్‌లు, నాయకులు అన్నారు. శనివారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేను అడ్డుకొని హత్య చేయడానికి యత్నించిన ఎంఐఎం పార్టీ నాయకులు అల్తాఫ్, నవీద్, సమీర్‌లతో పాటు మరికొందరు ఉన్నారని, వీరికి సహకరించిన వారిలో కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, షర్ఫులు ఉన్నారని, వీరిపై సైతం కేసు నమోదు చేయాలన్నారు. ఏసీపీకి ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ అధ్యక్షులు రవిందర్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, కౌన్సిలర్‌లు పాల్, దూప్‌సింగ్, జావిద్, అబ్దుల్లా, గంగారాం, రషీద్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్ తదితరులున్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెంజల్(బోధన్) : వానాకాలం సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు రైతు కూలీ సంఘం అద్వర్యంలో శనివారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కల్తీ విత్తనాలను అరికట్టాలని, రూ. లక్ష రుణమాఫీని వెంటనే అమలు చేయాలని పలు డిమాండ్లు చేశారు. అనంతరం పోడు భూముల రైతులకు హక్కులు కల్పించాలని తహశీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుమ్ముల గంగాధర్, డివిజన్ నాయకులు పుట్టి నాగన్న, రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

**సమాచారం..**

**నేడు చందూర్‌లో మంచి నీళ్ల పండగ**

రుద్రూర్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చందూర్ మండల కేంద్రంలో ఆదివారం మంచి నీళ్ల పండగ నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మెన్ ప్యారం అశోక్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ అతిథిగా హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు.

## ఉద్యమకారులపై కేసులను ఎత్తేయాలి


మాట్లాడుతున్న దుద్దు గంగాధర్

మాక్లూర్ : కక్షసాధింపు చర్యలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం మేధావులు, ఉద్యమకారులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద పీవైఎల్, ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొన్ని సభలు, సమావేశాల్లో కేసీఆర్ ప్రభుత్వంపై ఉన్నది ఉన్నట్టు మాట్లాడినందుకే ప్రగతిశీల మహిళ సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రొఫెసర్ హరగోపాల్, అరుణోదయం విమలక్కతో పాటు 152 మంది ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, నాయకులు శివకుమార్, కృష్ణంరాజు, భీమ్‌సింగ్, ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

## తండాల్లో గిరిజనోత్సవాలు

వర్ని : మండలంలోని పొట్టిగుట్ట, అంతపూర్ ,సేవాలాల్ తండా, డిపో తండా, సైదుపూర్ గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన ఉత్సవాలను నిర్వహించారు. శనివారం ఉదయం ఆయా గ్రామాల్లో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజు మందిరం వద్ద భోగ్ బండారు నిర్వహించి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాసు ఎంపీడీవో బషీరుద్దీన్, తహసీల్దార్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్(బోధన్):మండలంలోని వీరన్నగుట్ట తండా, కిసాన్‌తండా, మౌలాలితండా గ్రామాల్లో శనివారం గిరిజన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూజలు చేసి భోగ్‌బండార్ నిర్వహించారు. తండాలను జీపీలుగా గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తండా వాసులు పేర్కొన్నారు. మహిళలు నృత్యాలు చేశారు. సర్పంచ్‌లు జాదవ్ గణేశ్‌నాయక్, జమున విజయ్, లలితబాబులతో పాటు తహశీల్దార్ రాంచందర్, ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లిలో..**

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలంలోని గిరిజన గ్రామాల్లో శనివారం గిరిజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డీసీ తండా, కేసీ తాండల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉత్సవాలను నిర్వహించారు. గిరిజన ఆరాధ దైవం సంత్‌శ్రీ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేసి బోగ్ భండార్‌ను సమర్పించారు. అనంతరం గిరిజనులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎంపీడీఓ సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


డీసీ తండాలో పూజలు చేస్తున్న అధికారులు


వర్నిలో..


వీరన్నగుట్ట తండాలో..

## పేద విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

రుద్రూర్ : కోటగిరి రామకృష్ణ సేవా సమితి, హెల్ప్ ఎన్ హోప్ చారిటబల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పేద మెరిట్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సాయిరాం మాట్లాడుతూ మూడేళ్లుగా 28 మంది పేద మెరిట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, పుస్తకాలు అందించామన్నారు. ఈ సేవలు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నం, శ్రీకాకులం, విజయనగరం జిల్లాల్లో కొనసాగాయని, ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాకు విస్తరించామన్నారు. కోటగిరి వివేకానంద స్కూల్ విద్యార్థులు దుర్గ (10వతరగతి), ఝాన్సీ రాణి (9వతరగతి)లను దత్తత తీసుకుని వారి చదువు కోసం అయ్యే వ్యయాన్ని స్కూల్ యాజమాన్యానికి అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు గోగినేని శివ, శ్రీనివాస్, శివచరణ్, హన్మంత్‌రావ్ పాల్గొన్నారు.

### 465 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం జరిగింది. ఇందులో భాగంగా 465 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. స్లాట్ బుకింగ్ ఈనెల 19 వరకు కొనసాగుతుందన్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 21 తేదీ వరకు కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు.

### సమ్మె విరమించిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి) : జీతాల కోసం గత ఆరు రోజులుగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్న తెలంగాణ యూనివర్సిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శనివారం మధ్యాహ్నం సమ్మె విరమించారు. శుక్రవారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎం.యాదగిరి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో శనివారం సిబ్బంది జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. దీంతో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమ సమ్మెను విరమించి మధ్యాహ్నం భోజన విరామం అనంతరం విధుల్లో చేరారు.

### వర్సిటీని అభివృద్ధి చేయాలి

తెయూ(డిచ్‌పల్లి) : రెండేళ్లుగా తెయూలో వీసీ రవీందర్ నిధులు కాజేశారని ఆ డబ్బులను రికవరీ చేసి వర్సిటీ అభివృద్ధికి వాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, వర్సిటీ అధ్యక్షుడు వి.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీసీ రవీందర్ ప్రైవేట్ కళాశాల యాజమాని వద్ద రూ. 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం స్వాగతిస్తున్నామన్నారు.

### విద్యుత్ తీగలు సరి చేయండి

నిజామాబాద్ నాగారం : నగరంలోని గోల్‌హనుమాన్, జెండాబాలాజీ, సిర్నాపల్లి గడి ప్రాంతంలో విద్యుత్ రోడ్డు మీదే ప్రమాదకరంగా ఉన్నాయని సరిచేయాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీంధర్‌కు పర్యావరణవేత్త వైద్యుడు సుధీర్‌సింగ్ శనివారం వినతిపత్రం సమర్పించారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు.

### రైతాంగ సమస్యలపై పోరాడాలి

ధర్పల్లి: రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులు సంఘటితంగా పోరాటాలు నిర్వహించాలని ఏకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్ పిలుపునిచ్చారు. ధర్పల్లి మండల కేంద్రంలో శనివారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల రెండవ మహాసభలను నిర్వహించారు. ఈ సభలకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నష్టపరిహారం వెంటనే రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, మండల అధ్యక్షుడు ఉషన్న తదితరులున్నారు.

### 'మధ్యాహ్న' బిల్లులు చెల్లించాలి




రుద్రూర్ : పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని పాఠశాల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటగిరి తహసీల్దార్ ఆఫీస్ వద్ద శనివారం రాష్ట్ర మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ అజీజ్‌కు వినతిపత్రం అందచేశారు. ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య , మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, మండల నాయకులు విఠల్ గౌడ్, భూమయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి సన్మానం

కమ్మర్‌పల్లి : ఇటీవల వెలువడిన నీట్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో ర్యాంకు సాధించిన కమ్మర్‌పల్లికి చెందిన సుంకరి శ్రీవర్ధన్‌ను స్థానిక హన్మాన్ భక్తులు శనివారం అభినందించారు. ఎంబీబీఎస్‌లో ఆలిండియా లెవెల్లో 14,239వ ర్యాంకు, 594 మార్కులు సాధించి ప్రభుత్వ కోటాలో సీటు పొందబోతున్నందుకు అభినందించి జంబి హన్మాన్ ఆలయంలో శనివారం సన్మానించారు. ఈకార్యక్రమంలో రాజశేఖర్, రమణయ్య, జోగ గంగాధర్, రామస్వామి, డిష్ నరేందర్, రమేష్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.




### 'ఇన్నోవేషన్ చాలెంజ్'కు స్కూళ్ల ఎంపిక

నిజామాబాద్ అర్బన్ : ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో భాగంగా జిల్లా నుంచి రెండు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మోర్తాడ్ మండలం సుంకెట్ పాఠశాల ధర్పల్లి మండలం ఒన్నాజీపేట్ ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్ల ప్రాజెక్టులు ఈనెల 19, 20 21తేదీల్లో హైదరా బాదులో జరిగే క్యాంప్‌లో ప్రదర్శిస్తారు. ఉత్తమ ప్రదర్శనలను క్యాష్ అవార్డ్, సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. ఎంపికైన పాఠశాలల విద్యార్థులను డీఈవో దుర్గాప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, ఆయా పాఠశాలల హెడ్మాస్టర్‌లను గైడ్ టీచర్లను విద్యార్థులను అభినందించినారు.

### ఫిట్స్‌తో ఒకరి మృతి

నవీపేట : మండలంలోని మిట్టాపూర్ శివారులో నిజామాబాద్‌కు చెందిన దత్తుపూరి(46) ఫిట్స్‌తో మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఈనెల11న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన దత్తుపూరి తిరిగి ఇంటికి వెళ్లలేదన్నారు. శనివారం మిట్టాపూర్ శివారులో శవమై కనిపించాడని పేర్కొన్నారు. మతిస్థిమితం లేకపోవడంతో పాటు ఫిట్స్ వచ్చి ఉండొచ్చని మృతుని సోదరుడు ఆనంద్‌పూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**వెండితెర** తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 3.10; ది ఫ్లాష్ – 12.00, 6.55, 10.05
- స్క్రీన్-2 – ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00
- స్క్రీన్-3 – ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45
- స్క్రీన్-4 – ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15